సాక్షి తిరుపతి

శుక్రవారం । 23 । మే । 2025



రైల్వే ట్రాక్‌ల పటిష్టతకు చర్యలు

ముంబై- చెన్నై కారిడార్ రైలు మార్గంలో రైల్వేట్రాక్‌ల పటిష్టతకు కేంద్రం భారీగా నిధులు విడుదల చేసింది. - 10లో



రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు

రేషన్‌బియ్యం పక్కదారి పట్టినట్లు తెలిస్తే ఇక నుంచి కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. - 10లో



బాలుడి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

సత్యవేడులో బాలుడు వెంకటేష్ మృతి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. - 10లో

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండండి

తిరుపతి తుడా: కరోనా మహమ్మారి మరోసారి విజృంభించే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ఈ మేరకు కోవిడ్ జాగ్రత్తలపై వైద్య యంత్రాంగానికి పలు సూచనలు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ గురువారం కోవిడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. తగు జాగ్రత్తలతో బయటకు వెళ్లాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విదేశాల నుంచి వచ్చే వారిపై దృష్టి పెడుతున్నామని చెప్పారు. వారికి కోవిడ్ పరీక్షలు చేసేలా ఆదేశాలు వచ్చాయన్నారు. ఆ లక్షణాలుంటే.. ఐసోలేషన్‌లో ఉండేలా చూడాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గుంపులుగా చేరవద్దన్నారు. మాస్కు వాడకం మంచిదన్నారు.

579 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం మ్యాథ్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 4,436 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 579 మంది గైర్హాజరవ్వడంతో 3,857 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈఓ కేవీఎన్. కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన మ్యాథ్స్ పరీక్షకు 435 మందికి గానూ 54 మంది గైర్హాజరవ్వడంతో 381మంది పరీక్షకు హాజరయ్యారని చెప్పారు. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా నిర్వహించిన ఫిజికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 434 మందికి గానూ 60 మంది గైర్హాజరు కావడంతో 374 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈఓ తెలిపారు.

నేటి నుంచి సీపీఎల్

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి వేదికగా ఐపీఎల్ తరహాలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ సీజన్–1 క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. తిరుపతిలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తొలిసారిగా సీపీఎల్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ టోర్నీలో రంజీ, రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన క్రికెటర్లతో ఐదు జట్లును ఏర్పాటుచేసి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్న ఈ పోటీలను 6 కెమెరాలతో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు చెప్పారు. ఈ పోటీలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రారంభించనున్నారని, క్రికెట్ అభిమానులు, స్థానికులు సీపీఎల్ పోటీలను నేరుగా వీక్షించి క్రికెటర్లను ఉత్సాహపరచాలని ఆయన పిలుపునిచ్చారు.



ఎండీయూ వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ తిరుపతి తిమ్మినాయుడుపాలెం సమీపంలో గురువారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

రేషన్ బండి.. ఇక రాదండి

- ఎండీయూ వాహనాలను రద్దు చేసిన ప్రభుత్వం
- వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల్లోనే సరుకులు తీసుకోవాలి
- వలంటీర్లను తీసివేయడంతో ఇప్పటికే నిలిచిన ఇంటింటా సేవలు
- రేషన్ దుకాణాల వద్ద గంటల తరబడి పడిగాపులే !
- న్యాయపోరాటానికి సిద్ధం అవుతున్న ఎండీయూ ఆపరేటర్లు

తిరుపతి అర్బన్ : ఇన్నాళ్లూ ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ సరుకులు అందించిన బండి వచ్చే నెల నుంచి ఆగిపోనుంది. ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే విధానాన్ని చాలా రాష్ట్రాలు అభినందించడమే కూటమి ప్రభుత్వానికి నచ్చలేదు. అందుకే కుంటి సాకులు చెబుతూ వాహనాలను రద్దు చేస్తూ వచ్చే నెల నుంచి ప్రజలు తమ పరిధిలోని డీలర్ల దుకాణాల వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎండీయూ వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. న్యాయం కోసం పోరాటాలు చేయడానికి సిద్ధం అవుతున్నారు. మరోవైపు కార్డుదారులు మళ్లీ రేషన్ దుకాణం వద్ద క్యూలైన్లలో గంటల తరబడి పడిగాపులు తప్పవా అంటూ నిట్టూరుస్తున్నారు. జిల్లాలో పని చేస్తున్న 369 ఎండీయూ వాహనాలను నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తున్నా ఇప్పటికీ రేషన్ సరుకుల్లో కేవలం బియ్యం మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు కూడా అరకొర ఇస్తున్నారే తప్ప అందరికీ అందడం లేదు. సరుకులే సక్రమంగా ఇవ్వలేని కూటమి ప్రభుత్వం ఇక ప్రజలకు ఏమి మంచి చేస్తుందని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన మంచి కార్యక్రమాలు కూటమి ప్రభుత్వానికి నచ్చడం లేదు. సీఎం చంద్రబాబునాయుడుకు స్వతహాగానే ప్రజలకు మంచి చేయడం ఇష్టం ఉండదు. గత ప్రభుత్వంలో రేషన్ కోసం ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేలా బృహత్తర కార్యక్రమం అమలు చేశారు. ఈ విధానానికి దేశవ్యాప్తంగా మంచి కితాబు కూడా వచ్చింది. కానీ కూటమి ప్రభుత్వానికి ఇది నచ్చలేదు. ఎండీయూ వాహనాలను వచ్చే నెల నుంచి ఆపేస్తున్నట్లు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కూడా రద్దు చేసిన విషయం విదితమే.



విజయవాడ వరద సాయంలో తిరుపతి నుంచి వెళ్లి సేవలు చేస్తున్న ఆపరేటర్లు

పోరాటాలు చేస్తాం..



మాకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తాం. బ్యాంకుల్లో రుణం తీసుకుని ఎండీయూ వాహనాలు తెచ్చుకున్నాం. ప్రతి నెలా ఈఎంఐ కట్టాల్సి ఉంది. ఆ నగదు ఎలా కట్టాలి ? ఒక్కసారిగా మమ్మల్ని రోడ్డున పడేయడం ఈ ప్రభుత్వానికి న్యాయమేనా ? మాకు భార్య, బిడ్డలు, తల్లిదండ్రులు ఉంటారనే ఆలోచన లేకుండా వదిలేస్తే ఎలా? సీఎం చంద్రబాబునాయుడు మరోసారి ఎండీయూ వాహనాల రద్దు విషయంలో పునరాలోచన చేయాలి.

– డి.హరికృష్ణ, ఎండీయూ ఆపరేటర్, వాకాడు మండలం

మాకు అన్యాయం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో సుమారు 10 వేల ఎండీయూ వాహనాలను రాయితీలతో పేదలకు అప్పగించారు. తిరుపతి జిల్లాకు సైతం 369 మందికి వాహనాలు వచ్చాయి. క్రమం తప్పకుండా బియ్యం పంపిణీ చేస్తున్నాం. అయితే కూటమి సర్కారు వాటిని రద్దు చేయడంతో మేమంతా వీధినపడాల్సి వస్తుంది. న్యాయం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తాం. మాకు ప్రత్యామ్నాయం కల్పించాల్సిందే.

– కే.కిషోర్‌కుమార్, ఎండీయూ వాహనాల అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

వరదల సమయంలో విజయవాడకు వెళ్లాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడలో భారీ వరదలు వచ్చినప్పుడు రాష్ట్రంలోని అన్ని ఎండీయూ వాహనాలను పిలిచారు. మేమంతా వెళ్లాం. కొందరు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యాన్ని అందించాం. అయినా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మా సేవలు గుర్తుకు రాలేదు. ఎంతో బాధగా ఉంది. ప్రభుత్వాలు పది మందికి ఉపయోగపడేలా చట్టాలు చేయాలి. అంతేతప్ప పది మందికి నష్టాలు చేయడానికి చట్టాలు చేయడం సరికాదు.

– కే.మొహిద్దీన్,ఎండీయూ ఆపరేటర్, చిల్లకూరు మండలం

ఆలోచన చేయాలి కదా..



కూటమి ప్రభుత్వం మంచి చెడులను ఆలోచన చేయాలి. మాకు ఏ పార్టీతో సంబంధం లేదు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధి కల్పిస్తామంటే వెళ్లాం. ఆయన ఎండీయూ వాహనాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మాలాంటి వాళ్లందరికీ ఉపాధి కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబునాయుడు మాపై కక్ష్య సాధించడం ఏ మాత్రం న్యాయం కాదు.

– కుమార్, ఎండీయూ ఆపరేటర్, బీఎన్ కండ్రిగ మండలం

సామాన్య ప్రజలపై కక్ష సరికాదు..



ప్రభుత్వాలు మారినప్పుడల్లా కక్ష సాధింపు నిర్ణయాలు తీసుకుంటే సమాజానికి పెను ప్రమాదం తప్పదని భావిస్తున్నాం. 2029 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తే మళ్లీ ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేస్తే పరిస్థితి ఏంటి! ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమలు చేసిన వాటిని వచ్చే ప్రభుత్వం రద్దు చేస్తే ? ఈ విషయాలను ప్రభుత్వ పెద్దలు గుర్తించాల్సి ఉంది. నేతలపై కోపాన్ని సామాన్య పేద ప్రజలపై చూపడం సరికాదు. మాకు న్యాయం చేయండి.

– పార్థసారథి, ఎండీయూ ఆపరేటర్, తిరుపతి అర్బన్

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం..



మాకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తాం. ఏ తప్పు చేశామని మమ్మల్ని తొలగించారు ? అప్పటి ప్రభుత్వం ఏం చెబితే అదే చేశాం. కూటమి ప్రభుత్వంలోనూ ఏం చెబితే అదే చేశాం. విజయవాడ వరదల సమయంలో అక్కడకు వెళ్లాలని చెబితే ఆ మేరకు తిరుపతి జిల్లా నుంచి వెళ్లాం. ఎంతో మందికి ఇంటింటికీ వెళ్లి బియ్యం అందించాం. సీఎం చంద్రబాబునాయుడుకు మా సేవలు గుర్తుకు రావడం లేదు.

– గిరికుమార్, ఎండీయూ వాహన ఆపరేటర్

రాజకీయ రంగు వద్దు..



రెక్కాడితేగానీ డొక్కనిండని బతుకులు మావి. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాయం చేస్తామంటే వెళ్లాం. సబ్సిడీపై ఎండీయూ వాహనాలు ఇప్పించారు. ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాయం చేస్తామంటే వెళ్లాం. అంతే తప్ప అప్పటి ముఖ్యమంత్రి ఎవరికి సాయం చేశారో వారిపై కక్ష సాధిస్తామంటే న్యాయమా సార్ ? మళ్లీ వైఎస్ జగన్ సీఎం అయ్యాక కక్ష సాధించమని చెప్పినట్లుగా ఉంది ఈ ప్రభుత్వం తీరు.

– అస్రాఫ్, ఎండీయూ వాహనం ఆపరేటర్

సాధారణ మహిళలా వచ్చి..

- కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రాష్ట్ర హెల్త్ కమిషనర్ సిరి తనిఖీలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని ఆరోగ్య కేంద్రానికి ప్రతిరోజులాగే రోగులు వచ్చారు. సిబ్బంది వచ్చారు. అయితే వింత ఏముంది అంటారా ? గురువారం ఆరోగ్యకేంద్రానికి సాధారణ రోగులతో పాటు వచ్చి వారిలో కలిసిపోయి ఓపీ తీసుకునే దగ్గర నుంచి ప్రతి విషయాన్ని ఎవరికీ అనుమానం రాకుండా తనిఖీ చేశారు రాష్ట్ర వైద్యశాక కమిషనర్ సిరి. దీంతో ఒక్కసారిగా ఆరోగ్యకేంద్రం సిబ్బందితో పాటు రోగులు సైతం ఆశ్చర్యపోయారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఉదయం వైద్యశాఖ రాష్ట్ర కమిషనర్ సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి వైద్యుల పనితీరు, సూపరింటెండెంట్ మీజూరు చంద్రకళపై అనేక ఫిర్యాదులు అందడంతో కమిషనర్ ముందస్తు సమాచారం లేకుండా వచ్చారు. ఉదయం 9 గంటలకు ముందే కమిషనర్ సాధారణ మహిళగా ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు మాదిరిగానే ఓపీ మొదలుకొని అక్కడ జరుగుతున్న తంతును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆస్పత్రిలో ఎంతమంది డాక్టర్లు ఉన్నారు ? ఏ సమయానికి వస్తున్నారు ? వంటి విషయాలపై సైతం కమిషనర్ ఆరా తీశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ సెంటర్‌కు ఎన్ని గంటలకు వచ్చారనే విషయాలను అమె ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అనంతరం సూపరింటెండెంట్‌ను కలిసి ఆరోగ్య కేంద్ర పరిస్థితులపై వాకాబు చేశారు. అంతేగాకుండా వైద్యశాలకు సంబంధించి నిధులు సైతం గోల్‌మాల్ జరిగినట్లు తెలుసుకుని కమిషనర్ అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిసింది. ఆమె మధ్యాహ్నం వరకు కూడా హెల్త్ సెంటర్‌లో ఉండి ప్రతి విషయాన్ని నమోదు చేసుకున్నారు. కమిషనర్ స్థానిక విలేకరులతో మాట్లాడేందుకు నిరాకరించారు.

ప్రతిష్టాత్మకంగా అమృత్ భారత్ స్టేషన్

- వర్చువల్ విధానంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభించిన ప్రధాని
- మోదీ ముందుచూపుతోనే స్టేషన్ల అభివృద్ధి
- కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని

సూళ్లూరుపేట : అంతరిక్ష ప్రయోగాలకు అతి చేరువగా, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడలకు అత్యంత దగ్గరగా, నేలపట్టు పక్షుల పర్యాటక కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.14.50 కోట్లతో ఆధునీకరించిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభించడం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి దూరదృష్టితో అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా 1300 పైగా రైల్వేస్టేషన్లను ఆధునీకరించారని, అందులో భాగంగా గురువారం 130 రైల్వేస్టేషన్లను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, చెన్నై డివిజనల్ రైల్వే మేనేజర్ విశ్వనాథ ఈర్య, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఆర్డీఓ కిరణ్మయి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం, రైల్వే అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ వెంకటేశ్వర్

400 ఎకరాలకు పరిహారం అందించాం

చిల్లకూరు : తీర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు సంబంధించి సుమారు 400 ఎకరాల వరకు రైతులకు పరిహారం అందించామని, మరో 540 ఎకరాల వరకు పరిహారం అందించాల్సి ఉందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వాకాడు, చిట్టమూరు మండలాల పర్యటనలో భాగంగా ఆయన మార్గమధ్యలో చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్ సిటీ పనులు వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. అనంతరం గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లును పిలిపించి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసి పంపాలని సూచించారు. ఆయన వెంట గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ గోపి, ఆర్ఐ పూర్ణతో పాటుగా వివిధ శాఖల ఏఈలు, సిబ్బంది ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

చంద్రగిరి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని నాగయ్యగారిపల్లి సమీపంలోని స్వర్ణముఖినదిలో కొంతమంది అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకుని అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అయితే అధికార పార్టీకి చెందిన నేతల ట్రాక్టర్లు పగలూ రాత్రి తేడా లేకుండా ఇసుకను తరలిస్తుంటే పోలీసులు పట్టించుకోరు కానీ.. తమలాంటి సామాన్యులు సొంత అవసరాల కోసం ఇసుకను తీసుకెళ్తే ఇలా కేసులు పెట్టడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రుల్లో నాగయ్యగారిపల్లి స్వర్ణముఖినదిలో జేసీబీలతో ఇసుకను తరలిస్తున్నారని, పోలీసులు మాత్రం వారి వద్ద మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారంటూ మండిపడుతున్నారు.



పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు



మూడు రోజుల కిందట బొంతాలమ్మ ఆలయం సమీపంలో షెడ్లను కూల్చేస్తున్న అధికారులు

జలగల్లా పీల్చేస్తున్నారు

ఆధ్యాత్మిక నగరంలో కూటమి నేతల దందాలు

- ఒక్కో వీధివ్యాపారి నుంచి రోజూ రూ.వెయ్యి వసూళ్లు
- కొన్ని దుకాణాల నుంచి నెలకు రూ.10 వేలు
- అటవీ అధికారులకూ నెలకు రూ.10 వేలు ఇవ్వాల్సిందే
- పండ్లు, కూరగాయలు కొని డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోతున్న వైనం
- గట్టిగా అడిగినందుకే వీధి వ్యాపారులపై కూటమి నేతల జులుం

ఆధ్యాత్మిక నగరంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రశాంతత కరువైంది. తిరునగరిలో కూటమి నేతల దందాలు హెచ్చుమీరాయి. రోజురోజుకూ వారి వ్యవహార శైలికి తారాస్థాయికి చేరుతోంది. షాపులు, దుకాణాలు మొదలుకుని అందరి దగ్గర నుంచి వసూళ్ల పర్వానికి తెరలేపారు. ఇప్పుడు రోడ్ల పక్కన పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారులపై పడ్డారు. తాము అడిగినంత ఇస్తే సరి.. లేదంటే వారి పొట్ట కొడుతున్నారు. రోడ్డు ఆక్రమణ పేరిట కూల్చివేతలకు దిగుతున్నారు. కూటమి నేతల తీరు రోజురోజుకు దిగుజారుతుండడంతో జిల్లా ప్రజలు అసహ్యించుకుంటున్నారు.

సాక్షి ప్రతినిధి, తిరుపతి: ప్రసిద్ధిగాంచిన తిరునగరికి ప్రతి రోజూ వేలాది మంది పర్యాటకులు, భక్తులు వస్తుంటారు. నగర ప్రజల అవసరాలు, పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి నగరంలో చిరువ్యాపారులు తోపుడుబండ్లపై తినుబండారాలు, పండ్లు, పూలు, కూరగాయలు విక్రయిస్తున్న విషయం తెలిసిందే. అయితే కూటమి నేతలు వారి నుంచి మామూళ్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకపోతే ఆ మరుక్షణం చిరువ్యాపారులపై ప్రతాపం చూపిస్తున్నారు. ఆక్రమణ అంటూ కార్పొరేషన్ అధికారులను అడ్డు పెట్టుకుని తొలగిస్తున్నారు. మూడు రోజుల క్రితం నగరంలోని బొంతాలమ్మ ఆలయం వద్ద చోటుచేసుకున్న ఘటనే ఇందుకు నిదర్శనం. తిరుపతి నగరంలో మార్కెట్లను టెండర్ ద్వారా దక్కించుకున్న వ్యక్తి పేరు చెప్పి చిరు వ్యాపారుల నుంచి ప్రతి రోజూ రూ.1000 చొప్పున వసూళ్లు చేస్తున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న కార్పొరేషన్ కమిషనర్ గతంలో అధికారిక ప్రకటన చేశారు. నగరంలో తోపుడుబండ్లు, పండ్లు, పూలు విక్రయించే వారి నుంచి వసూళ్లు చేయడానికి వీల్లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆ కాంట్రాక్టర్ పేరు చెప్పి రోజూ వసూళ్లు చేస్తున్నట్లు చిరువ్యాపారులు చెబుతున్నారు.

వ్యాపారం చేసుకోవాలంటే అడిగినంత ఇవ్వు..

కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీలోని కొందరు నాయకులు తమ అనుచరులను చిరువ్యాపారులకు వద్దకు పంపించి ప్రతి రోజూ రూ.వెయ్యి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి, కపిలతీర్థం, గ్రూప్ థియేటర్స్, తాతయ్యగుంట గంగమ్మ, కూరగాయల మార్కెట్ పరిసరాలు, రద్దీ ప్రాంతాల్లో ఉన్న చిరు వ్యాపారులు మాత్రం కూటమి నేతలు అడిగినట్లు రోజూ వెయ్యి రూపాయలు ఇస్తున్నారు.

ఫారెస్టు అధికారులకూ మామూళ్లు ..

తిరుపతి–కరకంబాడి మార్గంలోని బొంతాలమ్మ ఆలయం వద్ద ఉన్న వ్యాపారులు ఒక్కొక్కరు అటవీ అధికారులకు ప్రతి నెలా రూ.10వేలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతటితో ఆగని అధికారులు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసి సగం డబ్బులు మాత్రమే ఇచ్చి వెళ్లిపోతున్నట్లు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. రూ.వెయ్యికి కొనుగోలు చేస్తే రూ.100 లేదా రూ.200 చేతిలో పెట్టి పోతున్నారని వాపోతున్నారు. మరో వైపు ఆ ప్రాంతానికి చెందిన ఓ జనసేన నాయకురాలు కూడా వారంలో రెండు, మూడు రోజులు కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసి తక్కువ మొత్తంలో చేతిలో పెట్టి వెళ్లిపోతున్నట్లు పలువురు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. వీరిని గట్టిగా అడిగినందుకే తమపై పోలీసులను ఉసిగొల్పి ప్రతాపం చూపించారని వీధివ్యాపారులు మండిపడుతున్నారు. అదే విధంగా ఎస్వీ యూనివర్సిటీ పరిసరాల్లోని చిరువ్యాపారులపైనా కూటమి నేతలు జులుం ప్రదర్శించినట్లు తెలిసింది.

రోడ్డు ఆక్రమణకు యత్నం

– అడ్డుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



ఆర్‌అండ్‌బీ రోడ్డులో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణం

రేణిగుంట: మండల పరిధిలోని పాపానాయుడు పేట–రేణిగుంట ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఎల్లమంద్యం రెవెన్యూ లెక్కదాఖలాలో సర్వేనంబర్ 263/9సి/ 1లో గల భూమికి సంబంధించి పత్రాలు ఉన్నాయని కొందరు వ్యక్తులు ప్రహరీ నిర్మాణం చేపడుతుండడంపై స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఆర్‌అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మురుగయ్యనాయుడు గురువా రం సంఘటనా స్థలానికి చేరుకుని ప్రహరీ గోడ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. గతంలో పిల్లర్లు వేసినప్పుడు కూడా నిలుపుదల చేశామని..అయినా కూడా రోడ్డుపై రాయి నాటారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్‌ఏ, రెవెన్యూ సర్వేయర్లు వచ్చి సర్వే చేశాకే పనులు చేసుకోవాలని లేదంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి లీగల్‌గా యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.99,300
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,957
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,00,900
రిటైల్ వెండి గ్రాము	రూ.103.90

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని..


మృతి చెందిన రవికుమార్

నాయుడుపేటటౌన్ : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఆర్ముగం నగర్‌కు చెందిన వృద్ధుడు రవికుమార్(65) కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. అతనికి కళ్లు సరిగా కనిపించవు. ఈక్రమంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. గురువారం ఉదయం శ్రీకాళహస్తి బైపాసు రోడ్డు సమీపంలో కార్తికేయ హోటల్ దగ్గరలో రోడ్డు పక్కన వృద్ధుడు మృతి చెంది ఉండడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. ఈ మేరకు మృతుడి కుమారుడు మేఘవర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించి, గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రైవేటు బస్సు చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలోని ప్రైవేటు ట్రావెల్స్ బస్సును దొంగిలించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. రేణిగుంటకు చెందిన ముస్తఫా గత ఒకటిన్నర నెల నుంచి యూనివర్సల్ బస్సు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. టీఎన్02 బీయూ 1030 నంబరు గల బస్సును ట్రిప్ నుంచి వచ్చాక చింతలచేను రోడ్డులో పార్కింగ్ చేసేవారు. రోజువారీలాగానే డ్రైవర్ శ్రీధర్, క్లీనర్ విజయ్ బస్సును పార్కిగ్ స్థలంలో ఆపి వెళ్లారు. బుధవారం రాత్రి పార్కింగ్ యజమాని ట్రావెల్స్ మేనేజర్ మునిరాజాకు ఫోన్ చేసి మీ బస్సును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని చెప్పాడు. దీంతో తనతో పాటు సాయిఈశ్వర్ ట్రావెల్స్ యజమాని మునిప్రసాద్, సెల్వకుమార్ చుట్టుపక్కల అంతా వెతికారు. బస్సు కనిపించకపోవడంతో యజమాని రవీంద్రకు తెలియజేశారు. అనంతరం గురువారం ఈస్ట్ స్టేషన్‌లో బస్సు యజమాని ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేశారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. బుధవారం అర్ధరాత్రి వరకు 80,964 మంది స్వామివారిని దర్శించుకోగా 32,125 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, టికెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తుడాకు ఆదాయం.. కీర్తిని పెంచాం

- ప్రజలకు మెరుగైన సేవలు అందించాం
- నిష్పక్షపాతంగా విచారణ జరిగితే మేము పడిన కష్టం ఏంటో తెలుస్తుంది
- నుడా పరిధిలో ఉన్న శ్రీసిటీని శ్రమించి తుడా పరిధిలోకి తీసుకొచ్చాం
- మా పరిపాలనపై విచారణ చేయమని సీఎంకు మేమే లేఖ రాశాం
- విజిలెన్స్ విచారణ ఎమ్మెల్యే నాని చేయించడమేంటి ?
- మీడియా సమావేశంలో తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : ''తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థకు గత ఐదేళ్ల ఆదాయాన్ని పెంచడమే కాదు.. తుడా కీర్తి, ప్రతిష్టలను అంతకంతకు పెంచాం.. తుడా చైర్మన్ పదవిని ఒక హోదాగా కాకుండా బాధ్యతగా తీసుకున్నాం.. జగనన్న సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాం.. ఎక్కడా చిన్న తప్పు కూడా జరగకుండా చూసుకున్నాం.. కూటమి ప్రభుత్వం కొలువు దీరగానే తుడాలో మా పరిపాలనపై విచారణ చేయించమని సీఎం చంద్రబాబు నాయుడుకు మేమే లేఖ రాశాం.. అలాంటప్పుడు విజిలెన్స్ విచారణ మీరు చేయించడమేంటి నానీ గారు..? ఆ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే తుడాను అభివృద్ధి పథంలో నడపడానికి తాము పడిన కష్టం ప్రజలకు కూడా తెలుస్తుంది..'' అంటూ తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు తుడా చైర్మన్లుగా పనిచేసిన కాలంలో జరిగిన పనులపై విజిలెన్స్ విచారణ చేయిస్తామన్న ఎమ్మెల్యే పులివర్తి నాని మాటలకు ఆయన స్పందించారు. ఒక చిన్న కార్యాలయంలా ఉన్న తుడా ఆఫీసును ఒక కార్పొరేట్ కార్యాలయంగా మార్చిన విషయం అందరికీ తెలుసన్నారు. తిరుపతి నగరంతో పాటు చంద్రగిరి నియోజకవర్గంలో రెండు మండలాలకు పరిమితమై ఉన్న తుడాను గత ఐదేళ్లలో తిరుపతి కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలతో పాటు 41 మండలాలు, 9 అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరింపజేశామన్నారు. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం తుడా చైర్మన్‌కు టీటీడీ పాలక మండలిలో ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అవకాశం లేకుండా ప్రత్యేకంగా చట్టం చేసి మరీ తీసేస్తే.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ అవకాశం కల్పించిన ఘనత చెవిరెడ్డికే దక్కుతుందన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తుడా పరిధిలోకి ఆక్రమిత స్థలాలు

తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు కొందరు 15 ఎకరాల స్థలం తమదని ఆక్రమించి ఫెన్సింగ్ వేసుకుని, న్యాయస్థానాల్లో కేసులు వేసుకుంటే.. సొంత పార్టీ వాళ్లు అని కూడా చూడకుండా వారితో న్యాయపోరాటం చేసి ఆ స్థలాలను తుడాకు స్వాధీనం చేసి ప్లాట్లు వేసి ఆదాయం వచ్చేలా చేశామన్నారు. ఇవన్నీ ప్రజలకు తెలియాలంటే ఏ అధికారి అయినా సరే విచారణ నివేదిక ఎవరినో మెప్పించడానికి కాకుండా నిజాయితీగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. తుమ్మలగుంటలో ఏర్పాటు చేసిన కేవీఎస్ పార్క్ తమ సొంత ఆస్తి కాదని, అది ప్రజలదని.. దాన్ని నాశనం చేస్తామంటే వారే తిరగబడతారన్నారు. సమావేశంలో తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నియాదవ్, బీసీ నేత మల్లెమొగ్గల ఉమాపతి, ఎస్సీసెల్ అధ్యక్షుడు శెల్వం, మల్లారపు వాసులు పాల్గొన్నారు.

తుడా పరిధిలోకి శ్రీసిటీ

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద ఉన్న శ్రీసిటీని కూడా ఎంతో శ్రమించి అప్పటి ముఖ్యమంత్రి జగనన్న సహకారంతో తుడా పరిధిలోకి తెచ్చామని మోహిత్ రెడ్డి తెలిపారు. తుడాలో పనిచేసే ఉద్యోగులకు ప్రమోషన్లు పూర్తిగా నిలిపివేసి, జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నపుడు తన తండ్రి చెవిరెడ్డి తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఏళ్ల తరబడి ఒకే హోదాలో పనిచేస్తున్న వారికి ప్రభుత్వం పెద్దలతో చర్చించి ప్రమోషన్లు ఇప్పించారన్నారు. రాష్ట్రంలో ఏ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చేయని విధంగా తుడాలో ఒక కొత్త సంప్రదాయాన్ని చెవిరెడ్డి తీసుకొచ్చారన్నారు. తుడా తరపున తీసుకోబోయే ప్రతి నిర్ణయాన్ని అందురు రాజకీయ పార్టీ నేతల సమావేశంలో చర్చించేలా ఒక నిబంధన పెట్టారని, పారదర్శకంగా పనులు చేయడానికి ఆ సమావేశం ఎంతో ఉపయోగపడేదన్నారు. ఆ విషయం తుడా కార్యాలయంలో ఉన్న మినిట్స్ బుక్ చూస్తే అందరికీ అర్థమవుతుందన్నారు. చెవిరెడ్డి తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించక ముందు రూ.25 కోట్లతో తుడాను గత టీడీపీ ప్రభుత్వం తమకు అప్పగిస్తే రూ.439 కోట్ల ఆదాయంతో జగనన్న ప్రభుత్వంలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి 2024లో ఈ ప్రభుత్వానికి అప్పగించారని తెలిపారు. ''ఇప్పుడు చెప్పండి నానీ.. తుడాను మా ఫ్యామిలీ ప్యాకేజీలా వాడుకున్నామా..?'' అని ప్రశ్నించారు. 2019లో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తుడా చైర్మన్ అయ్యే నాటికి అనేక సంవత్సరాలుగా సూరప్పకశం దగ్గర 145 ఎకరాలు భూమిని ఓ మల్టీ నేషనల్ కంపెనీతో పాటు స్థానిక భూ ఆక్రమణదారుల చెర నుంచి విడిపించి తుడాకు అప్పగించామన్నారు. ఆ స్థలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి మధ్యతరగతి ప్రజలకు ఇళ్ల స్థలాలకు విక్రయించి తుడాకు ఆదాయాన్ని తెచ్చిపెట్టినట్టు చెప్పారు. అన్నమయ్య సర్కిల్ వద్ద ప్రస్తుతం తుడా నిర్మిస్తున్న తుడా టవర్స్ స్థలంలో తిరుపతి మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి అప్పటి మున్సిపల్ అధికారులు తమ ఆధీనంలో పెట్టుకుని ఫెన్సింగ్ వేసుకుంటే, ప్రభుత్వంతో పోరాడి ఆ స్థలాన్ని తుడా పరిధిలోకి తెచ్చామన్నారు. ఇప్పుడు కడుతున్న టవర్స్ నిర్మాణానికి తామే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

రైల్వే ట్రాక్‌ల పటిష్టతకు చర్యలు

- రూ.3,200 కోట్ల బడ్జెట్ కేటాయింపు
- ఫెన్సింగ్, సబ్‌వే వంటి పనులకు నిధులు
- సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ నిర్ణయం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: ముంబై–చెన్నై కారిడార్ రైలుమార్గంలో రైల్వేట్రాక్ పటిష్టతను దృష్టిలో ఉంచుకుని సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. రైల్వే ట్రాక్‌కూ ఇరువైపులా ఫెన్సింగ్, సబ్‌వే వంటి పనులకు రూ.3,200 కోట్లు కేటాయించింది. ఇప్పటికే దాదాపు అన్ని లైన్లను 130 కి.మీ. స్పీడ్‌తో రైళ్లు వెళ్లేలా సామర్థ్యం పెంచిన నేపథ్యంలో ట్రాక్‌లపై ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

సబ్‌వేల నిర్మాణానికి ప్రతిపాదనలు

మూగజీవాలు, వన్యప్రాణులు, పాడిపశువులు, ఆత్మహత్యలు, సంఘవిద్రోహ శక్తులు వంటివి ట్రాక్‌పైకి రాకుండా పటిష్ట చర్యల్లో భాగమే ఫెన్సింగ్ విధానం. వాడి, గుంతకల్, ఖాజీపేట, కడప, తిరుపతి, గూడూరు తదితర మార్గాలలో ఫెన్సింగ్ లేదా ప్రహరీ, సబ్‌వేలు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ నిధులు కూడా విడుదల చేసింది. అయితే అటవీ ప్రాంతాల్లో జంతువులు ట్రాక్ దాటే క్రమంలో, గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలు, పాడిపశువులు ట్రాక్ పైకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి.

వేగసామర్థ్యం తట్టుకునేలా..

వందేభారత్ వంటి హైస్పీడ్ రైళ్ల కోసం రెండేళ్ల క్రితం సౌత్ సెంట్రల్ రైల్వే తన పరిధిలోని అన్ని ప్రధాన మార్గాల్లో 130 కిలోమీటర్లకు పైగా వేగాన్ని తట్టుకునేలా సామార్థ్యాన్ని పెంచింది. హైస్పీడ్ రైళ్లు తిరుగుతున్న పట్టాలపై స్టీల్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. జాతీయ రహదారుల సమీపంలో ఉన్న ట్రాక్‌లపై క్రియోసెట్ ఆయిల్‌తో ట్రీట్ చేసిన వెదురు బొంగులతో ఫెన్సింగ్ లేదా ప్రహరీలు నిర్మించనున్నారు. మరికొన్ని చోట్ల సబ్‌వే నిర్మాణాలకు చర్యలు చేపట్టారు.

బాలుడి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

సత్యవేడు: బాలుడు వెంకటేష్ మృతి కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళీనాయుడు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాలుడు వెంకటేష్ మృతికి సంబంధించి సత్యవేడు మండలం నరసరా జు అగ్రహారం చెందిన ముత్తు(60) ధనభాగ్యం(55), రాజశేఖర్(32) అరెస్టు చేశామన్నారు. గూడూరు మండలం చవటపాలెం గ్రామానికి చెందిన చెంచయ్య, అంకమ్మకు చెంచుకృష్ణయ్య, రామ లక్ష్మమ్మ, వెంకటేష్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు.

భర్త చనిపోవడంతో బాలున్ని వదిలి..

అంకమ్మకు ఏడాది కిందట నరసరాజు అగ్రహారానికి చెందిన ముత్తు రూ.10 వేలు ఇచ్చి సత్యవేడుకు తీసుకొచ్చారు. ఇక్కడికి వచ్చాక అంకమ్మ తన పిల్లలతో కలిసి బర్రెలు, బాతులకు కాపలాదారుగా ఉండేది. 3 నెలల కిందట అంకమ్మ భర్త చెంచయ్య చనిపోవడంతో సొంతూరుకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. తమకు ఇవ్వాల్సిన డబ్బు ఇచ్చి వెళ్లాలని యజమాని ముత్తు పట్టుపట్టడంతో విధిలేని పరిస్థితుల్లో ఆమె 9 ఏళ్ల కొడుకు వెంకటేశ్‌ను వారి వద్దే వదలివెళ్లింది. బాలుడితో ముత్తు వెట్టిచాకిరీ చేయించుకోవడంతో పాటు హింసించేవాడు. కొన్నాళ్లకు బాలుడు వెంకటేష్‌ను తీసుకొని యజమాని ముత్తు తమిళనాడులోని కంచి ప్రాంతానికి బాతులు మేపడానికి తీసుకెళ్లాడు. అయితే తల్లి అంకమ్మ కుమారుడితో ఫోన్‌లో మాట్లాడేందుకు చాలాసార్లు ప్రయత్నించగా మీ కొడుకు కనిపించడంలేదని ముత్తు తెలిపాడు. దీంతో ఆమె ఈ నెల 19న సత్యవేడుకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా గుట్టురట్టయింది. కంచిలో ఉన్న సమయంలో బాలుడు అస్వస్థతకు గురి కావడంతో ఏప్రిల్ 11వ తేదీన కంచి సమీపంలోని లింగ ఆస్పత్రిలో చేర్పించగా.. 12న చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా కంచి వద్ద పాలేరు నదిలో పూడ్చి పెట్టినట్లు నిందితుడు ముత్తు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. పోలీసులు కంచికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని వెలికితీసి అక్కడి అధికారుల సమక్షంలో పంచనామా చేశారు. అనంతరం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

విశ్వం విద్యార్థుల ప్రభంజనం

తిరుపతి కల్చరల్: జాతీయ స్థాయిలో గత నెల ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 9వ తరగతి విభాగంలో 400 మార్కులకు 370 మార్కులు సాధించి వి.మోక్షిత్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు కైవశం చేసుకోవడం గర్వంగా ఉందన్నారు. అలాగే 6వ తరగతి విభాగంలో 300 మార్కులకు 281 మార్కులతో హృతిక్ రాయల్, 275 మార్కుతో వి.నిహార్, 270 మార్కులతో సోహిని అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. వీరితో పాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహిదర్, అశ్విన్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే గణితంలో 50/50 మార్కులు విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు సాధించడం గర్వకారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ విశ్వంచందన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న విశ్వం విద్యాసంస్థల అధినేత

రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

వాకాడు: పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. గురువారం ఆయన వాకాడులోని సివిల్ సప్లై గోడౌన్(ఎంఎల్ఎస్ పాయింటు)ను తనిఖీ చేశారు. అనంతరం బియ్యం నాణ్యత, బియ్యం బస్తాల తూకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బియ్యం నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గోడౌన్‌లోని పలు రికార్డులు పరిశీలించారు. తాను ఇక్కడికి వస్తున్నానని తెలుసుకుని ఎప్పటి నుంచో రాయాల్సిన రికార్డులు రాయకుండా ఇప్పటికిప్పుడు హడావుడిగా ఒకే రకం పెన్‌తో రికార్డుల్లో రాశారని తెలిపారు. ఈ గోడౌన్‌పై అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారని.. ఇకనైనా పద్ధతి మార్చుకోకపోతే ఉద్యోగం ఊడుతుందని గోడౌన్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లును హెచ్చరించారు. గత రెండున్నరేళ్లగా ప్రజలకు అందాల్సిన 7.5 టన్నుల కందిపప్పు అందజేయకుండా ఎందుకు గోడౌన్‌లో నిల్వ ఉంచారని మందలించారు. ప్రైవేట్ వాహనాల్లో బియ్యం తరలిస్తున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయని, ఇకపై ఇలా జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తహసీల్దార్ రామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ దీప, తదితరులు ఉన్నారు.


పొలంలో 11 రకాల విత్తనాలను చల్లుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

కలెక్టర్‌కు మొర పెట్టుకున్న రైతులు

దొరవారిసత్రం : మండలంలోని లింగంపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం కింద ఆరు ఎరకాల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం వ్యవసాయధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా పలు గ్రామాల రైతులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థానికంగా డ్రై యంత్రాలు లేనందున దళారుల చేతుల్లో మోసపోతున్నామని, మండలస్థాయిలో డ్రై యంత్రాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. నెర్రికాలువ నుంచి లింగంపాడు గ్రామంలోని చెరువులోకి సాగు నీళ్ల సరఫరా చేసే సప్లయ్ చానల్ లాక్‌లు దెబ్బతినడం, కాలువ పూడిపోవడంతో చెరువులోకి నీళ్లు రావడం లేదన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో నెర్రికాలువ పొరంబోకు భూమి ఆక్రమణకు గురైందని లింగంపాడు, తల్లంపాడు రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన ఆయన నెర్రికాలువపై ఉన్న లాక్‌ల మరమ్మతులకు, కాలువలో పూడిక తీతకు ఎఫ్‌డీఆర్ కింద నిధుల కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపాల్సిందిగా సంబంధిత ఇరిగేషన్ ఏఈ రమేష్‌కు ఆదేశించారు. అంతేకాకుండా నెర్రికాలువ పొరంబోకు భూమి ఆక్రమణలను సైతం తొలగించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. లింగంపాడు గ్రామంలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయం గురించి ఏపీ సీఎస్ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏడీఏ అనిత వివరించారు. ఆయన వెంట ఏఓ జ్యోతిర్మయి, ఏఈలు ఉమామహేశ్వరి, హరికృష్ణ, ఉషారాణి, మోహన్ రావు, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'రెవెన్యూ' బదిలీలకు కసరత్తు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రెవెన్యూ శాఖలో బదిలీల కసరత్తు వేగవంతంగా సాగుతోంది. ఈ బదిలీలు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికన నిర్వహిస్తుండటంతో చిత్తూరు కలెక్టరేట్ అధికారులు కీలకం కానున్నారు. షెడ్యూల్ మేరకు బదిలీలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టరేట్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. బదిలీలకు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

రేణిగుంట: మండలకేంద్రంలోని సీబీఐడీ కాలనీ సమీపంలోని బాలాజీ నగర్‌లో ఓ యువతి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. వివరాలు.. బాలాజీ నగర్‌లో కాపురం ఉంటున్న వరలక్ష్మి కుమార్తె ప్రతిక్ష (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందింది. అయితే కాసేపు తర్వాత తల్లి గమనించగా వేలాడుతూ కనిపించింది. స్థానికులు పోలీసుల కు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్యకళాశాలకు తరలించారు. అయితే ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన ఓ యువకుడితో ప్రేమ విషయంలో విబేధాలు రావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


సిఫార్సులకే కార్పొరేషన్ రుణాలా!

- ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుపై నీలినీడలు
- దరఖాస్తుల ప్రక్రియ నుంచే అక్రమాలకు తెరలేపిన కూటమి ప్రభుత్వం
- రెండు రోజుల పాటు పనిచేయని సర్వర్లు
- 1,267 యూనిట్లకు 5,600 దరఖాస్తులు
- అంతటా గోప్యత పాటిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై గంపెడాశలు పెట్టుకున్న లబ్ధిదారులకు అధికారులు మొండి చేయి చూపేలా ఉన్నారు. మూడు రోజుల పాటు సర్వర్లు పని చేయకపోవడంతో పలువురు అర్హత ఉన్నా.. దరఖాస్తులు చేసుకోలేని దుస్థితి నెలకొంది. దీంతో దరఖాస్తులకు గడువు పెంచుతారని అంతా భావించగా.. ఆ ఊసేలేదు. ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు ఇచ్చారు. ఈ నెల 9, 10 తేదీల్లో సర్వర్లు పని చేయకపోవడంతో పలువురు నిరాశ చెందారు. ఆ రెండు రోజులకు బదులు మరో రెండు రోజులు గడువు ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

రుణాలు ఎప్పుడిస్తారో..!

జిల్లాలో 1267 యూనిట్లుకు 5,600 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 10వ తేదీ నాటికి దరఖాస్తులకు గడువు ముగిసింది. ఈ నెల 9న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారికి ఈ నెల 20వ తేదీకల్లా రుణాలు మంజూరు చేయాలని ఈడీ చెన్నయ్యకు ఆదేశాలు ఇచ్చారు. అయితే కార్పొరేషన్ అధికారులు మాత్రం కలెక్టర్ ఆదేశాలను పక్కన పెట్టి ప్రజాప్రతినిధుల సిఫార్సు లెటర్ల కోసం ఎదురు చూస్తున్నట్లు చర్చ సాగుతోంది. కూటమి నేతలు ఇచ్చిన జాబితా ప్రకారమే లబ్ధిదారులను ఎంపిక చేస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలతో పనిలేకుండా పార్టీ నేతల సిఫార్సులకే తొలి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులే బాహాటంగా చెప్పేస్తున్నారు. అర్హతలతో పని లేకుండా నేతలు చెప్పినవారికే ఇచ్చేటప్పుడు తమకు ఆశలు కల్పించడం ఎందుకని పలువురు దరఖాస్తుదారులు విమర్శిస్తున్నారు.


ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్(ఫైల్)

అంతా గోప్యంగా..

కార్పొరేషన్ అధికారులు రాయితీ రుణాలకు సంబంధించి అన్ని అంశాలను గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 10వ తేదీ నాటికి దరఖాస్తులకు గడువు ముగియగా.. ఆ తర్వాత ఎన్ని దరఖాస్తులు వచ్చాయో మీడియాకు కూడా సమాచారం ఇవ్వడం లేదు. అంతేకాదు ఎప్పటి నుంచి ఇంటర్వ్యూలు మొదలు కానున్నాయో అనే సమాచారాన్ని చెప్పడం లేదు. అసలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారా ? లేదా ? నేతల సిఫార్సులు లేఖలు ఉన్నవారికే నేరుగా ఇచ్చేస్తారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి.

టెక్నికల్ సమస్యలు ఉన్నాయి



రాష్ట్రస్థాయి అధికారుల ఉత్తర్వుల మేరకు ఎంపిక చేస్తాం. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి ఈ నెల 10 వరకు గడువు ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ నెల 9, 10 తేదీల్లో పలుచోట్ల సర్వర్లు పనిచేయలేదు. అంతేకాకుండా టెక్నికల్ సమస్యలు చోటు చేసుకున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ నెల 20వ తేదీకి పూర్తి చేయమని చెప్పారు. అయితే రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందిన వెంటనే ప్రక్రియను ప్రారంభిస్తాం. సిఫార్సు లెటర్లకు ప్రాధాన్యత ఉండదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వారికే రుణాలు అందిస్తాం.

– చెన్నయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, తిరుపతి జిల్లా